క్లుప్తంగా

పోలేరమ్మకు పూలాభిషేకం

కడియం: కార్తిక మాసంలో ఆఖరి శుక్రవారం సందర్భంగా దుళ్ల గ్రామదేవత పోలేరమ్మకు పూలాభిషేకం ఘనంగా నిర్వహించారు. ముందుగా ప్రత్యేక కుంకుమ పూజలు, ఆధ్యాత్మిక గీతాల ఆపనలు జరిగాయి.

3న మండల పరిషత్ సమావేశం

కడియం: మండల పరిషత్ సమావేశాన్ని డిసెంబర్ 3వ తేదీ ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో కె.రమేష్ తెలిపారు. ఎంపీపీ వెలుగుబంటి సత్య ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, వివిధ శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

వైభవంగా హారతులు

కడియం: కడియపులంక గ్రామ దేవత ముసలమ్మవారి ఆలయంలో శుక్రవారం పంచ మంగళ హారతుల కార్యక్రమం వైభవంగా జరిగింది. పవళింపు సేవ అనంతరం ప్రసాద వితరణ చేశారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభం



మాట్లాడుతున్న ఆర్‌జేడీ శారద

కంబాలచెరువు: విద్యార్థులు శాస్త్రీయ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ఆర్‌జేడీ ఐ.శారద అన్నారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనను శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్‌జేడీ మాట్లాడుతూ విద్యార్థులలో దాగిఉన్న శాస్త్రీయ పరిజ్ఞానాన్ని వెలికితీయడానికే ఇలాంటి వైజ్ఞానిక ప్రదర్శనలు ఉపయోగపడతాయన్నారు. జిల్లా ఆర్‌ఐవో ప్రిన్సిపాల్ ఎన్ఎస్‌వీఎల్ నరసింహం, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎ.శ్రీనివాస్, అటల్ టింకరింగ్ ల్యాబ్ ఇన్‌చార్జి పి.శ్రీనివాస్ రెడ్డి, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్‌ను పరిశీలించిన కలెక్టర్



ఈవీఎం గోడౌన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): లాలాచెరువు సమీపంలోని ఈవీఎం గోడౌన్‌ను ఆర్డీఓ ఆర్.కృష్ణ నాయక్‌తో కలిసి కలెక్టర్ పి.ప్రశాంతి శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు ఈవీఎంలు భద్రపరచిన గోడౌన్ సందర్శించి, తనిఖీలు చేశామన్నారు. నిరంతర సీసీ కెమెరాల ప్రత్యక్ష పర్యవేక్షణలో స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచినట్టు తెలిపారు. అక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించామన్నారు. ఆమె వెంట అర్బన్ తహసీల్దార్ పీహెచ్‌జీఆర్ పాపారావు, రెవెన్యూ, భద్రతా సిబ్బంది ఉన్నారు.

ఒకటిన కాపు వన సమారాధన

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం కాపు సంక్షేమ అండ్ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి కాపు కుటుంబ సభ్యుల ఆత్మీయ కలయిక (వనసమారాధన-2024) నిర్వహించనున్నారు. జేఎన్ రోడ్డు హైవే జంక్షన్ బెస్ట్‌ప్రైస్ పక్కన గల చెరుకూరివారి కొబ్బరితోటలో ఈ కార్యక్రమం జరుగుతుంది. ఈ మేరకు ఆహ్వాన కమిటీ సభ్యులు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. వన సమారాధనకు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. పిల్లలకు, మహిళలకు వినోద, సాంస్కృతిక, ఆటల పోటీలు నిర్వహిస్తామన్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష బిల్వార్చన



హోమం నిర్వహిస్తున్న ట్రస్ట్ సభ్యులు

సీటీఆర్ఐ: గోదావరి తీరంలోని కాశీ అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి మందిరంలో శుక్రవారం లక్ష బిల్వార్చన, కుంకుమార్చన నిర్వహించారు. వివేకానంద సనాతన ధర్మ ప్రచార సమితి ట్రస్ట్ నిర్వహణలో ఉదయం 9 నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమం జరిగింది. పురోహితుడు తొయ్యేటి సీతారామ శర్మ మాట్లాడుతూ కాశీ విశ్వేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన, అన్నపూర్ణాదేవికి లక్ష కుంకుమార్చన, హోమం చేశామన్నారు. కార్యక్రమంలో వెంకట రత్నాజీ, ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు కాకి నాగేశ్వరరావు బ్రదర్స్, నగర ప్రముఖులు ఆకుల వీర్రాజు, అశోక్ కుమార్ జైన్ పాల్గొన్నారు.

పతకాల పంట



బాలకృష్ణ సాధించిన పతకాలు



సిల్ట్ వర్కర్‌గా విధులు నిర్వహిస్తున్న బాలకృష్ణ

- పవర్ లిఫ్టింగ్‌లో పారిశుధ్య కార్మికుడి ప్రతిభ
- సత్తా చాటుతున్న బాలకృష్ణ

ప్రకాశం నగర్: ఆత్మవిశ్వాసం, ఆసక్తి ఉంటే ఏ రంగంలోనైనా విజయకేతనం ఎగురవేయవచ్చు. నిరంతర సాధనతో గెలుపు తీరాలకు చేరుకోవచ్చు. ఈ మాటలు మున్సిపల్ పారిశుధ్య కార్మికుడైన అర్జీ బాలకృష్ణ విషయంలో వంద శాతం నిజమయ్యాయి. ఆయన తన వృత్తిలో కొనసాగుతూనే పవర్ లిఫ్టింగ్‌లో సత్తా చాటుతున్నారు. అనేక టోర్నమెంట్లలో పతకాలు సాధించి శభాష్ అనిపించుకుంటున్నారు.

ఆసక్తితో..

ధవళేశ్వరానికి చెందిన అర్జీ బాలకృష్ణ పదో తరగతి వరకూ చదువుకున్నాడు. తండ్రి కాశేశ్వరరావు మున్సిపల్ కార్మికుడు కావడంతో బాలకృష్ణ కూడా సిల్ట్ వర్కర్‌గా పనిలో చేరాడు. అతడికి పవర్ లిఫ్టింగ్ అంటే ఎంతో ఆసక్తి. దానిలో విజయాలు సాధించాలని, పతకాలు గెలుచుకోవాలని అనుకునేవాడు. దీంతో కార్మికుడిగా విధులు నిర్వహిస్తూనే ఇంటి సమీపంలోని జిమ్‌కు వెళ్లడం మొదలు పెట్టాడు. బాలకృష్ణ ప్రతిభను గమనించిన జిమ్ కోచ్ డీవీవీ సత్యనారాయణ పవర్ లిఫ్టింగ్‌లో శిక్షణ ఇచ్చారు.

పతకాల పంట

కోచ్ శిక్షణలో పవర్ లిఫ్టింగ్‌లో మెళకువలను బాలకృష్ణ తెలుసుకున్నాడు. దేశ వ్యాప్తంగా జరిగిన అనేక పోటీలలో పాల్గొన్నారు. 2014 నుంచి పవర్ లిఫ్టింగ్‌లో జిల్లా స్థాయిలో 23, రాష్ట్ర స్థాయిలో 20 బంగారు, 19 వెండి పతకాలు, రెండు స్ట్రాంగ్ మ్యాన్ పతకాలు సాధించాడు. అలాగే సౌత్ ఇండియా నేషనల్స్ పవర్ లిఫ్టింగ్ కాంపిటిషన్‌లో 74 కేజీల విభాగంలో బంగారు పతకం సాధించాడు.

పనితో పాటు శిక్షణ

బాలకృష్ణ ఉదయం నాలుగు గంటలకు విధులకు వస్తాడు. పని ముగిసిన తర్వాత భోజనం చేసి తర్వాత జిమ్‌లో శిక్షణ తీసుకుంటాడు. బాలకృష్ణ ఆర్థిక పరిస్థితి చూసిన కోచ్ డీవీవీ సత్యనారాయణ..పోటీలకు అవసరమైన ఎంట్రీ ఫీజులు చెల్లించడం, సెకండ్ హ్యాండ్ సూట్ సమకూర్చడం వంటి చేసేవారు. సాధనతో పాటు పోషకాహారం కూడా చాలా అవసరం. దీంతో బాలకృష్ణ తనపై అధికారి అయిన ఓ.ధనరాజ్ ఆర్థిక సాయంతో వాటిని సమకూర్చుకునేవాడు. నాలుగేళ్ల కిత్రం పని ముగించుకుని ఇంటికి వెళుతున్న క్రమంలో రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలయ్యాడు. దీంతో కొన్ని రోజులు ఇంటికే పరిమితమయ్యాడు. తోటి కార్మికులు, ఉద్యోగులు, కోచ్ సహాయ సకారాలతో మళ్లీ జిమ్‌కు వెళ్లి పవర్ లిఫ్టింగ్‌లో పతకాల పంట పండిస్తున్నాడు.



సౌత్ ఇండియా పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించిన బాలకృష్ణ

మాకు గర్వకారణం



మా సిల్ట్ బ్యాచ్‌లో సుమారు 45 మంది వర్కర్లు కాలువల్లో సిల్ట్‌ను తొలగించే పనిచేస్తున్నారు. వారిలో ఒకడైన బాలకృష్ణ పనితో పాటు పవర్ లిఫ్టింగ్‌లో పతకాలు సాధించడం మాకు గర్వకారణంగా ఉంది. బాలకృష్ణ సాధించిన పతకాలు అతడి ప్రతిభకు గుర్తింపుగా నిలుస్తున్నాయి. పేదరికంతో పాటు ఎన్నో కష్టాలు ఓర్చుకుని, దాదాపు పదేళ్ల పాటు అతను సాధించిన విజయాలు ఎందరికో ఆదర్శం.

– ధనరాజ్, సిల్ట్ ఇన్‌స్పెక్టర్

గాడాలలో 1,08,012 రుద్రాక్షలతో మహార్చన



షర్మిలారెడ్డితో అర్చన చేయిస్తున్న చిన్న వెంకన్నబాబు

సీటీఆర్ఐ: గాడాల గ్రామంలో మహాలక్ష్మీ సమేత చిన్న వేంకటేశ్వరస్వామి పీఠంలో కొలువుతీరిన చక్ర వాహిని భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామికి శుక్రవారం 1,08,012 రుద్రాక్షలతో మహార్చన నిర్వహించారు. పీఠాధిపతి చిన్న వెంకన్నబాబు ఆధ్వర్యంలో శుక్రవారం తెల్లవారుజామున 4.30 గంటల నుంచి ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి మాట్లాడుతూ లోక కల్యాణార్థం చిన్న వెంకన్నబాబు ఈ కార్యక్రమం చేపట్టారన్నారు. కార్యక్రమంలో ఉభయరాష్ట్రల చైర్మన్ మతాల రమేష్, పీఠం నిత్య సేవకుడు దత్త నృసింహరాజు, మనగుడి – మనసేవ ఆధ్యాత్మిక సేవా సమితి జాతీయ చైర్ పర్సన్ ధరణీకోట దుర్గావెంకట హేమవతి పాల్గొన్నారు.

బీమా ఉద్యోగుల సమావేశం పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాథ్యూస్, కోదండరామ్ తదితరులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): చెన్నైలో డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం వర్కింగ్ కమిటీ సమావేశం జరుగుతుందని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం.కోదండరామ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఎల్ఐసీ డివిజన్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ఆ సమావేశం పోస్టర్‌ను ఆవిష్కరించారు. యూనియన్ అధ్యక్షుడు ఎస్ఆర్‌జే మాథ్యూస్, ప్రధాన కార్యదర్శి ఎం.కోదండరామ్, యూనియన్ నాయకుల చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. కోదండరామ్ మాట్లాడుతూ బీమారంగం ఎదుర్కొంటున్న సవాళ్లు తదితర అంశాలపై చర్చ జరుగుతుందన్నారు. జీవిత బీమా సంస్థలో ఖాళీగా ఉన్న మూడు, నాలుగో తరగతి ఉద్యోగ నియామకాలు వెంటనే చేపట్టాలని, అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘానికి గుర్తింపు ఇవ్వాలని కోరుతూ కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామన్నారు. యూనియన్ అధ్యక్షుడు మాథ్యూస్ మాట్లాడుతూ ఈ సమావేశానికి రాజమండ్రి డివిజన్ తరఫున కోదండరామ్ హాజరవుతారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు సి. హెచ్.సత్యదేవ, మహిళా కన్వీనర్ అర్.శిరీష, ఉమాదేవి, సంయుక్త కార్యదర్శి పి ఎస్ ఎన్ రాజు, కోశాధికారి ఈశ్వరరావు,ఇతర నాయకులు గన్నెయ్య, బి.శ్రీనివాసరావు, దొరబాబు, రామకృష్ణ, రమేష్ బాబు, డి. శ్రీనివాస్,పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ విజయభాస్కర్‌కు జాతీయ అవార్డు



కంబాలచెరువు: రాజమహేంద్రవరం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కార్యదర్శి, నేత్ర కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ పిడుగు విజయ భాస్కర్‌ను ఐఎంఏ ప్రెసిడెంట్స్ అప్రిషియేషన్ అవార్డు వరించింది. ఈ మేరకు ఐఎంఏ జాతీయ కార్యదర్శి డాక్టర్ అనిల్ కుమార్ నుంచి విజయభాస్కర్‌కు ఉత్తర్వులు అందాయి. జాతీయ అవార్డు సాధించిన విజయ భాస్కర్‌ను నగరానికి చెందిన పలువురు ప్రముఖులు కలిసి అభినందించారు. ఆయన ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాజమహేంద్రవరం శాఖకు ఎనిమిదేళ్లుగా కార్యదర్శిగా సేవలు అందిస్తున్నారు. లక్షకు పైగా కంటి ఆపరేషన్లు నిర్వహించారు. హైదరాబాద్‌లో డిసెంబర్ 27న జరిగే ఐఎంఏ జాతీయ సదస్సులో విజయ భాస్కర్ అవార్డు అందుకుంటారు.

హరిహర క్షేత్రంలో అన్న సమారాధన



అనంతేశ్వరున్ని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి

కడియం: కడియపులంకలోని హరిహర క్షేత్రంలో కార్తిక మాసం మాస శివరాత్రిని పురస్కరించుకుని శుక్రవారం భారీ అన్నసమారాధన జరిగింది. పదహారేళ్లుగా నిరాటంకంగా జరుగుతున్న ఈ కార్యక్రమానికి కడియం మండలం నుంచే కాక చుట్టు పక్కల ప్రాంతాల నుంచి సైతం భారీ ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా తెల్లవారు జామునుంచే అపర్ణా సమేత అనంతేశ్వర స్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. అనంతరం ప్రసాద వితరణ ప్రారంభించారు. స్వామివారిని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి దర్శించుకున్నారు. కాగా.. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ చైర్మన్ మార్గాని సత్యనారాయణ, పాలక వర్గం సభ్యులు, నర్సరీ పెద్దలు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా కడియం ఇన్‌స్పెక్టర్ ఎ.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం, కొత్త పూలమార్కెట్ ఆవరణల్లో ఏర్పాటు చేసిన కౌంటర్ల వద్ద భక్తులకు ప్రసాద వితరణ జరిగింది. సుమారు యాభైవేల మంది వరకూ ఈ కార్యక్రమానికి హాజరయ్యారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

విశ్వసనీయత పెంచడమే పేరెంట్స్ మీటింగ్ లక్ష్యం



సమావేశానికి హాజరైన విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు

కంబాలచెరువు: ప్రభుత్వ పాఠశాలలపై విద్యార్థుల తల్లిదండ్రులకు విశ్వసనీయత పెంచడమే మెగా పేరెంట్స్ మీటింగ్ లక్ష్యమని విద్యాశాఖ డైరెక్టర్ విజయ రామరాజు అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో డిసెంబర్ 7వ తేదీన మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్ నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా విద్యా శాఖధికారులు, ప్రధానోపాధ్యాయులతో శుక్రవారం స్థానిక ఎస్‌కేవీటీ పాఠశాలలో వెబినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా పాఠశాల విద్యార్థుల తల్లితండ్రులతో పండగ వాతావరణంలో సమావేశం నిర్వహించాలన్నారు. ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్ సమావేశ లక్ష్యాలను వివరించారు. తల్లితండ్రులను, దాతలను, వార్డు పెద్దలను ఈ సమావేశానికి ఆహ్వానిస్తూ పిల్లల చేత ఆహ్వాన పత్రిక తయారుచేసి పంపాలన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ సమావేశం నిర్వహించాలన్నారు. ప్రధానోపాధ్యాయులు ముందుగానే ఈ సమావేశ నిర్వహణకు కమిటీలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. విద్యార్థులు, పాఠశాల సమగ్ర సమాచారాన్ని సమావేశంలో ప్రధానోపాధ్యాయులు వివరించాలన్నారు. అనంతరం విద్యార్థులు, తల్లితండ్రులు, ఉపాధ్యాయులు కలిసి ప్రభుత్వం పాఠశాలల్లో అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం చేయాలన్నారు. కార్యక్రమానికి పూర్వ విద్యార్థులు, దాతలను ప్రత్యేకంగా ఆహ్వానించాలన్నారు. ఆ పాఠశాల వార్డ్ మహిళా పోలీసులను ఆహ్వానించి సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థుల ప్రగతి నివేదిక కోసం ప్రత్యేకంగా హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డును పంపిస్తామన్నారు. దానిపై ప్రత్యేకమైన మార్కర్ తో మాత్రమే వివరాలు నింపాలని, మామూలు పెన్, స్కెచ్ పెన్ వాడరాదన్నారు. విద్యార్థుల తల్లులకు ముగ్గుల పోటీ, తండ్రులకు టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్, అర్బన్ ఎంఈవో – 2 రమా రజని, డీసీఈబీ సెక్రటరీ డి.అనిత తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నియంత్రణపై విస్తృత అవగాహన



గోకవరం బస్టాండ్‌లోని ఐటీసీ స్టాల్ వద్ద వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది

కంబాలచెరువు: ఎయిడ్స్ నియంత్రణే లక్ష్యంగా వైద్య,ఆరోగ్యశాఖ ద్వారా విస్తృతస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నామని జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారి (డీఎంఅండ్‌హెచ్‌వో) డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం గోకవరం బస్టాండ్‌లో ఐటీసీ మెటీరియల్‌తో కూడిన అవగాహన స్టాల్‌ను ఏర్పాటు చేశారు. జిల్లా అదనపు వైద్య,ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.వసుంధర మాట్లాడుతూ డిసెంబర్ ఒకటిన నిర్వహించే ప్రపంచ ప్రపంచ ఎయిడ్స్‌డేలో భాగంగా ఈ స్టాల్ ఏర్పాటు చేశామన్నారు. దీని ద్వారా ఎయిడ్స్ నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. నారీ సాక్ష్యం, వైఆర్‌జీ కేర్ స్వచ్ఛంద సంస్థల సమక్షంలో ఐటీసీ ప్రదర్శన స్టాల్ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ న్యూక్లియస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.హారిక, డాక్టర్ మానస, వైఆర్‌జీకేఆర్ సోమరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్ జిల్లాల బాల్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం



బిక్కవోలులో క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న ఎస్సై వాసంశెట్టి రవిచంద్ర కుమార్



రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

- క్రీడాకారులతో సందడిగా మారిన బిక్కవోలు ఉన్నత పాఠశాల
- తొలిసారి బిక్కవోలులో రాష్ట్ర స్థాయి పోటీలు

బిక్కవోలు: స్థానిక ఉన్నత పాఠశాల వద్ద 68వ ఆంధ్రప్రదేశ్ అంతర జిల్లా బాల్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభించారు. శుక్రవారం ఈ కార్యక్రమానికి అధ్యక్షుడిగా పల్లా వీర ప్రభాకర్ వ్యవహరించారు. బిక్కవోలు ఎస్సై వాసంశెట్టి రవికుమార్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. క్రీడా పతాకాన్ని ముఖ్య అతిథులు ఆవిష్కరించారు. అనంతరం 13 జిల్లాల నుంచి విచ్చేసిన క్రీడాకారులచే గౌరవ వందనం చేశారు. జాతీయ, రాష్ట్ర క్రీడాకారులతో క్రీడా జ్యోతిని వెలిగించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపు ఓటమిలను స్వీకరించాలన్నారు. గతంలో కంటే మెరుగైన ఆటను పదర్శించి ఉన్నత స్థానానికి ఎదగాలన్నారు. క్రీడాలు వల్ల ఎన్నో లాభాలు ఉన్నాయి. క్రీడా వలన ఆరోగ్య, మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వాని పొందవచ్చును అన్నారు. క్రీడా వలన ఉన్నత ఉద్యోగాలు వస్తాయని, చదువుతో ఆటలు అవసరం అని ప్రతి క్రీడాకారులు గుర్తించాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం పల్లా వీర ప్రభాకర్‌రావు మాట్లాడుతూ మన పాఠశాల 140 మంది రాష్ట్రంలో బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు రావడం చాలా ఆనందం ఉంది. వచ్చిన క్రీడాకారులు అందరూ కలిసి క్రీడా స్ఫూర్తితో మెలగాలని సూచించారు. ఈ సందర్భంగా బిక్కవోలు ఎంతో మంది బాల్ బ్యాడ్మింటన్ క్రీడకు విశేష కృషి చేసిన కీర్తి శేషులు మానకొండ వీరరాఘవరెడ్డి కొనియాడారు అనంతరం ఘన నివాళులు అర్పించారు. లీగ దశలో ఎనిమిది జట్టు విజయం ఎంపికచేశారు. గ్రూప్ ఏ నుంచి గుంటూరు, పశ్చిమ గొదావరి, గ్రూప్ బీ నుంచి విజయనగరం, తూర్పు గొదావరి, గ్రూప్ సీ నుంచి శ్రీకాకుళం, కర్నూలు, గ్రూప్ డీ నుంచి విశాఖ పట్నం,ప్రకాశం జిల్లాలు ఎంపిక య్యారు. క్వార్టర్‌లో శ్రీకాకుళంపై పశ్చిమ గొదావరి జిల్లా పోటీ పడగా శ్రీకాకుళం విజయం సాధించి సైమి ఫైనల్స్ అర్హత సాధించారు. అలాగే గుంటూరు పై కర్నూలు మధ్య జరిగిన పోటీలో గుంటూరు విజయం సాధించి సైమి ఫైనల్స్ అర్హత సాధించారు. వాతావరణ వర్షం రావడం కొంత సమయం ఆటకు అంతరాయం కలిగింది. మిగిలిన మ్యాచ్‌లు శనివారం కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలోని తూర్పు గోదావరి జిల్లా క్రీడా సమాఖ్య కార్యదర్శి స్వామి,జిల్లా డిఎస్ఓ శేషగిరి రావు, రాష్ట్ర అబ్జర్వర్ రజిన, జిల్లా పీడీ పీఈటీటీ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రసాద్,అనపర్తి జోన్ వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు పి.శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి టీవీ రాఘవరెడ్డి, సింహాదిరావు, బంగారు రాజు, పీడీలు మానకొండ ధనరాజ్, అప్పారెడ్డి, దార్వంపూడి యువరాజారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, జావేద్, వీకేఆర్ తంబి, క్రీడాకారులు పాల్గొన్నారు.

వల్లభ గణపతి ఆలయం సందర్శన



విధుశేఖర భారతీస్వామికి స్వాగతం పలుకుతున్న సామవేదం షణ్ముఖ శర్మ తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: కొంతమూరులోని శ్రీవల్లభ గణపతి ఆలయాన్ని శృంగేరీ పీఠం ఉత్తరాధికారి విధుశేఖర భారతీ స్వామి శుక్రవారం సందర్శించారు. సమన్వయ సరస్వతి సామవేదం షణ్ముఖ శర్మ, మందిరం ట్రస్టీ టీవీ నారాయణ రావు, ఇతర ప్రముఖులు ఆయనకు సాదరంగా స్వాగతం పలికారు. మందిర ప్రాంగణంలోని ఉపాలయాలను కూడా స్వామి సందర్శించారు.

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి

పెదపూడి: సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన తప్పనిసరిగా ఉండాలని తద్వారా సైబర్ నేరాలు నివారణ సాధ్యమవుతుందని అనపర్తి సీఐ వీఎల్ వీకె సుమంత్ అన్నారు. కొప్పవరం గ్రామంలో శుక్రవారం ప్రజలకు సైబర్‌నేరాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. సుమంత్ మాట్లాడుతూ ఓఎల్ఎక్స్, సోషల్ మీడియా, ఎంప్లాయిమెంట్, లోన్ యాప్, ఫేక్ పోలీసు, ఓటీపీ, ఏటీఎం, క్రెడిట్ కార్డు తదితర అంశాలపై సైబర్ నేరాలకు పాల్పడుతున్నారన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



రాజవోలులో మొక్కలు నాటుతున్న వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ శ్రీనివాస్ తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటి, వాటిని సంరక్షించడం మనందరి బాధ్యత అని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ డి.శ్రీనివాసు అన్నారు. రాజమహేంద్రవరం వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో రాజవోలు గ్రామంలో గురువారం ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా వనమహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీన్ శ్రీనివాస్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మొక్కల వల్ల కలిగే ప్రయోజనాలు, ఆవశ్యకతను రైతులకు, గ్రామ ప్రజలకు వివరించారు. ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ సీహెచ్ సునీత మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా మొదటి రోజు వనమహోత్సవంలో చెట్లను నాటామని, రెండవ రోజు మట్టి పరీక్షలు, కంపోస్టు తయారీ, మూడో రోజు వైద్య, రక్త దాన శిబిరాల నిర్వహణ, స్వచ్ఛ భారత్ ర్యాలీ, నాలుగో రోజు ఎలుకల నివారణ, వ్యవసాయ యాంత్రీకరణ ఆవశ్యకత, ఐదో రోజు స్త్రీలకు పోషక ఆహార అవశ్యకత గురించి తెలియజేస్తామన్నారు. ఆరో రోజు పెరటి తోటల పెంపకంపై అవగాహన, ఏడో రోజు రైతు సదస్సు, రైతు శాస్త్రవేత్తల చర్చా కార్యక్రమం జరుగుతుందన్నారు. మండల వ్యవసాయాధికారి భీమరాజు, పశు వైద్యుడు డాక్టర్ వెంకటరావు ప్రసంగించారు. రైతులకు బీపీటీ 2858 (రెడ్ రైస్) మినీ కిట్లను పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ నిమ్మలపూడి రామకృష్ణ, డీఎస్ఏ డాక్టర్ జి.కరుణా సాగర్ తదితరులు పాల్గొన్నారు.